
ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

పల్లె వైద్యం పడకేసింది



రోగులు లేని అస్పరి పీహెచ్‌సీ

- 18వ రోజుకు చేరిన పీహెచ్‌సీ వైద్యుల సమ్మె
- వైద్యం అందక గ్రామీణుల అవస్థలు
- ఆర్ఎంపీ, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు
- ఉమ్మడి జిల్లాలో 216 మంది వైద్యుల సమ్మె

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యం పడకేసింది. ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన సమ్మె బుధవారానికి 18వ రోజుకు చేరింవది. గత నెల 26వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాలోని (కర్నూలు 32, నంద్యాల 52) 87 పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యులు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. రోగులను చూసే దిక్కు లేకుండా పోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పీహెచ్‌సీలకు వస్తే అక్కడ రోగులను చూసే దిక్కు లేకుండా పోయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు జీజీహెచ్, సీహెచ్‌సీ, ఆయుష్, డెంటల్, పీజీ వైద్య విద్యార్థులను ప్రతి పీహెచ్‌సీకి నియమించారు. ఫలితాలు మాత్రం కనిపించడం లేదు. చాలాచోట్ల నర్సింగ్ సిబ్బంది అందిస్తున్న వైద్యంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. కర్నూలు జిల్లాలో 35 పీహెచ్‌సీలో 96 మంది, నంద్యాల జిల్లాలో 52 పీహెచ్‌సీలో 120 మంది వైద్యులు సమ్మెలో ఉండటంతో వైద్యులు కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.



జేబులు ఖాళీ చేసుకుంటూ..

వైద్యులు లేరని తెలుసుకున్న ప్రజలు వైద్యం కోసం పట్టణాల్లోని ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్ఎంపీలను ఆశ్రయిస్తూ జేబులను ఖాళీ చేసుకుంటున్నారు. ప్రతినెల 2000 నుంచి 2500 వరకు ఉంటే ఓపీ రోగులు 1500కు చేరాయి. ప్రతి రోజు ఓపీ రోగులు 200 నుంచి 250 మంది ఉండేవారు. సమ్మె కారణంగా ఈ సంఖ్య 100కు దిగజారింది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా చాలా పీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పీహెచ్‌సీలకు వచ్చిన రోగులు తమకు ఇదివరకు చికిత్స ఇచ్చిన వైద్యులు లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు.

మిగతా 7వ పేజీలో

గురుకులంలో వంద శాతం మార్కులు రావాలి

డీఈవో జనార్దన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో జనార్దనరెడ్డి

కోవెలకుంట్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల పదో తరగతి విద్యార్థినిలకు ఉత్తమ విద్య బోధించి, వంద శాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోవెలకుంట్ల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా జనవరి 26న వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించేందుకు ప్రస్తుతం పాఠశాలలో వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో మండలం నుంచి అంచెల వారీగా రాష్ట్రస్థాయికి ఎంపికైన వారికి బహుమతులు ఇస్తామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థినులను ఉపాధ్యాయులు కన్నబిడ్డల్లా చూసుకోవాలని సూచించారు. అనంతరం డిప్యూటీ డీఈవో వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా మండల పరిషత్ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు ఒక్కో మొక్క అందించి పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటసుబ్బయ్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి, హెచ్ఎంలు పాల్గొన్నారు.

గూడెంలో బడికి తాళం

- బడిబాట వీడి.. అడవి బాట పట్టిన విద్యార్థులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



మూతపడిన జానాలగూడెం గిరిజన పాఠశాల ఇదే

కొత్తపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అరణ్యంలో ఉంటూ విద్యాభివృద్ధికి నోచుకోని గిరిజన విద్యార్థుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. అందరితో పాటు సమాన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరడం లేదు. ఇందుకు ఉదాహరణగా కొత్తపల్లి మండలంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న జానాల గూడెంలో ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలగా చెప్పవచ్చు. ఈ పాఠశాలలో 24 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో వెంకటస్వామి అనే గిరిజన ఉపాధ్యాయుడు అక్కడే ఉండి, విద్యార్థులకు చదువు చెప్పేవాడు. ఏడాది కింద ఆ ఉపాధ్యాయుడు మండలంలోని శివపురం గిరిజన ఆశ్రమ పాఠశాలకు బదిలీపై వెళ్లాడు. అప్పటి నుంచి ఈ పాఠశాల విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. ఆ ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లిన తర్వాత ఓ ఉపాధ్యాయురాలు ఆత్మకూరు నుంచి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న జానాల గూడెంలో ఈ పాఠశాలలో పని చేసేది. ఆమె కూడా బదిలీపై వెళ్లిన తర్వాత ప్రస్తుత డీఎస్సీ కింద ఎంపికైన ఓ ఉపాధ్యాయురాలిని నియమించినప్పటికీ ఆమె కూడా ఒకటి రెండు రోజులు ఉండి వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించకపోవడంతో బడికి తాళం పడింది. దీంతో విద్యార్థులు కృష్ణానదిలో చేపల వేటకు, మరికొందరు తల్లిదండ్రుల వెంట అడవి బాట పట్టారు. మరి కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రుల వెంట ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో పాఠశాల మూత పడింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద పాఠశాలకు లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించినప్పటికీ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల వర్షం వస్తే కారుతుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై శ్రీశైలం ఐటీడీఏ ఏఎంవో రామాంజనేయులును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. పాఠశాల మూతపడినట్లు తన దృష్టికి వచ్చిందని, మరో రెండు రోజుల్లో ఉపాధ్యాయుని నియమిస్తామని చెప్పారు.

ఐటీడీఏ అధికారులు పట్టించుకోవడం లేదు



జానాల గూడెంలో పాఠశాల మూతపడిందని తెలిసినప్పటికీ ఐటీడీఏ అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యార్థులు బడి మానుకుని మా వెంట పనులకు వస్తున్నారు. అలాగే అంగన్వాడీ స్కూల్ కూడా టీచర్ లేకపోవడం వల్ల మూతపడింది. అధికారులు తక్షణమే స్పందించి ఉపాధ్యాయుడ్ని నియమించాలి.

- బరములు లక్ష్మమ్మ, జానాలగూడెం

సున్నిపెంట సీహెచ్‌సీకి డయాలసిస్ కేంద్రం



సున్నిపెంట ఆస్పత్రి

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సున్నిపెంట సీహెచ్‌సీకి డయాలసిస్ కేంద్రం మంజూరైంది. ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం కింద రాష్ట్ర వ్యాప్తంగా మంజూరైన ఏడు కేంద్రాల్లో సున్నిపెంట సీహెచ్‌సీ ఒకటి. నిరుపేదలు డయాలసిస్ చేయించుకునేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ప్రతి రోజు 15 మందికి చొప్పున రక్తశుద్ధి చేసే అవకాశం కల్పిస్తారు. ఒక్కొక్కటి రూ.75లక్షలు విలువ చేసే మూడు రక్తశుద్ధి యంత్రాలు ఆస్పత్రిలో ఏర్పాటు చేయనున్నారు. శ్రీశైల పరిసర ప్రాంతంలో డయాలసిస్ చేయించుకునే రోగులకు ఈ కేంద్రం సౌకర్యవంతంగా ఉంటుంది. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో మాత్రమే ఉచిత డయాలసిస్ కేంద్రం ఏర్పాటుచేశారు. ప్రస్తుతం సున్నిపెంటలో ఏర్పాటు చేస్తున్నారు.

కిడ్నీ రోగులకు ఉపయోగకరం



సున్నిపెంటలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుచేయడంతో కిడ్నీ రోగులకు ఉపయోగకరం. సున్నిపెంటలో 10మంది కిడ్నీ సంబంధిత రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. ప్రస్తుతం డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో కర్నూలు జిల్లాతో పాటు ప్రకాశం జిల్లా వాసులకు కూడా అందుబాటులో ఉంటుంది.

- డాక్టర్ లలిత, డీసీహెచ్ఎస్(డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్), నంద్యాల

మహిమాన్వితం కార్తీకమాసం

- శివకేశవులను ధ్యానించే మాసం
- జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన ఆలయాలు
- నేటి నుంచి ప్రారంభం



నంద్యాల కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శివ,కేశవులకు అత్యంత ఇష్టమైనది కార్తీకమాసం. ప్రతిఏటా దీపావళి పండుగ వెళ్లిన మరుసటి రోజు నుంచి కార్తీక మాసం ప్రారంభమవుతుంది. నోములు, వ్రతాలకు ఈ మాసం ఎంతో ప్రధాన్యం. బుధవారం నుంచి కార్తీకమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. తెలుగు సంవత్సరంలో వచ్చే ఎనిమిదో మాసమే కార్తీకం. చంద్రుడు కృత్తికా నక్షత్రంతో కలుస్తాడు కాబట్టే ఈ మాసాన్ని కార్తీకం అని అంటారు. శివకేశవులను భక్తిశ్రద్ధలతో కొలిచే ఈ మాసంలో చేసే పూజలు, నోములూ వ్రతాల వల్ల ఎన్నో శుభ ఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందుకే హైందవులు ఈ నెల మొత్తం నోములు, వ్రతాలు, జపం, ధ్యానం, పూజ, దానం, దీపారాధనతో భక్తిని చాటుకుంటారు. నెల రోజుల పాటు చేయలేని వారు కార్తీకంలో వచ్చే ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి, మాస శివరాత్రి, సోమవారాల్లో ఉపవాస దీక్షను నియమనిష్ఠలతో ఆచరిస్తుంటారు. ఆ రోజుల్లో ఉపవాసం ఉండి చీకటి పడిన తర్వాత నక్షత్ర దర్శనం చేసుకుని ఉపవాసాన్ని విడుస్తారు.

దీపారాధనకు ప్రాధాన్యం: కార్తీక మాసంలో దీపారాధనకు మహిళలు అధిక ప్రాధాన్యమిస్తారు. పూజలు చేసిన మహిళలు ఉపవాసాలతో శివకేశవులను ధ్యానిస్తారు. ప్రధానంగా సోమవారం రోజున బ్రహ్మ ముహూర్తంలోనే లేచి చన్నీటి స్నానాలు చేసిన తర్వాత కార్తీక దీపాలను వెలిగిస్తే పుణ్యఫలం సిద్ధిస్తుందని మహిళలు భావిస్తారు. ఈ నెలలోనే అయ్యప్ప దీక్ష మొదలై సంక్రాంతి వరకూ కొనసాగుతుంది.

మహానందిలో 'ఆకాశ దీపం'



ఆకాశదీపం వెలిగిస్తున్న వేదపండితులు

మహానంది, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో మంగళవారం రాత్రి ఘనంగా కార్తీక మాసోత్సవాలను ఆలయ వేదపండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించిన అర్చకులు ధ్వజస్తంభం వద్దకు పూజా ద్రవ్యాలతో చేరుకున్నారు. కార్తీక మాస ఉత్సవాల సందర్భంగా సకల దేవతలను మహా నంది క్షేత్రానికి ఆహ్వానిం చేందుకు వీలుగా 'ఆకాశ దీపం' వెలిగించారు. వచ్చే నెల 20వ తేదీ వరకు మహానందిలో కార్తీక మాస ఉత్సవాలు జరుగుతాయని ఆలయ అర్చకులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ వెల్లడించారు.

అమరుల సేవలు మరువలేం

- జిల్లా న్యాయాధికారి అమ్మన్న రాజు
- పోలీసు అమరవీరులకు ఘన నివాళి
- హాజరైన కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షెరాన్



జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరుల సేవలు ఎనలేనివని జిల్లా న్యాయాధికారి అమ్మన్న రాజు అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సునీల్ షెరాన్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయాధికారి, ఎస్పీతో పాటు కలెక్టర్ రాజకుమారి హాజరయ్యారు. ముందుగా వారు పోలీసు గౌరవ వందనం స్వీకరించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు శాంతి భద్రతలు కాపాడుతూ ప్రజలకు రక్షణగా నిలుస్తున్నారన్నారు. వారు మానసికంగా, శారీరకంగా ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మార్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. పెరిగిపోతున్న సైబర్ క్రైం పట్ల పోలీసులు కూడా ముందు జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నంద్యాల జిల్లాలో పోలీసుల పనితీరు బాగుందని న్యాయాధికారి, కలెక్టర్ కొనియాడారు. రాత్రి పగలు తేడా లేకుండా విధులు నిర్వహించడం ఒక్క పోలీసుకే సాధ్యమని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ యుగంధర్‌బాబు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



జిల్లా న్యాయాధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఎస్పీ యుగంధర్‌బాబు

అమరవీరులకు మంత్రి బీసీ నివాళి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మంగళవారం నివాళులర్పించారు. దేశసేవలో వీర మరణం పొందిన అమరుల కుటుంబాలకు ఎప్పుడూ రుణపడి ఉంటామన్నారు. వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

అవిశ్వాసం వీగేనా..?



అవిశ్వాస తీర్మాన సమావేశ భవనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు

- రసవత్తరంగా ఆదోని మండల రాజకీయం
- ఎత్తుకు పైఎత్తులు వేస్తున్న పార్టీలు
- మౌనం దాల్చిన ఎమ్మెల్యే పార్థసారథి
- రంగంలోకి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు
- నేడు అవిశ్వాస తీర్మాన సమావేశం

ఆదోని మండల రాజకీయం రసవత్తరంగా మారింది. ఎంపీపీని పదవి నుంచి తొలగించేందుకు వైసీపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఎంపీపీ దానమ్మ వైసీపీ నుంచి గెలిచి బీజేపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి దానమ్మను పదవి నుంచి తొలగించేందుకు వైసీపీ ఎంపీటీసీలతో అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. దీనికి బుధవారం ముహూర్తం ఖరారైంది. అవిశ్వాస తీర్మానం వీగిపోయేందుకు సహకరించాలని ఎంపీపీ, ఆమె కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పార్థసారథిని కలిశారు. ఆయన చేతులెత్తేశారు. ఈ విషయం టీడీపీ నాయకులకు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు రంగంలోకి దిగారు. అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా ఎంపీపీ అవిశ్వాస తీర్మానంతో మండలంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

ఆదోని రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అవిశ్వాస తీర్మానంలో నెగ్గాలని ఎంపీపీ దానమ్మ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఆదోని మండల రాజకీయం రసవత్తరంగా మారింది. ఎంపీపీ అవిశ్వాస తీర్మాన సమావేశ రూపంలో రాజకీయం వేడెక్కింది. ఎంపీపీ దానమ్మపై వైసీపీ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానాన్ని కోరడంతో బుధవారం అధికారులు సమావేశాన్ని నిర్వహించనున్నారు. దానమ్మ వైసీపీ తరఫున గెలిచి ఎంపీపీ పదవిని అలంకరించారు. కూటమి ఏర్పడ్డాక ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో ఆమె భర్త బడాయి పంపాపతితో కలిసి బీజేపీ కండువా కప్పుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఎలాగైనా ఆమెను ఎంపీపీ పదవి నుంచి తొలగించాలని వైసీపీ ఎంపీటీసీలతో అవిశ్వాసాన్ని పెట్టించారు. దానమ్మపై అవిశ్వాసం పెట్టించిన రోజు 19మంది ఎంపీటీసీలు వైసీపీకి ఉండేవారు. నేడు ఆ సంఖ్య తగ్గుముఖం పట్టింది.

ఎమ్మెల్యేను కలిసినా..

ఎంపీపీ అవిశ్వాస తీర్మానంపై ఎమ్మెల్యే పార్థసారథి మౌనంగా ఉన్నారు. ఆదోనిలో లేకపోవడంతో ఎంపీపీ దానమ్మ, ఆమె భర్త పంపాపతి, తనయుడు మధుతో పాటు అనుచరులు విజయవాడలో ఉంటున్న ఎమ్మెల్యేను కలిశారు. తమకు సహకరించాలని, ఎలాగైనా ఎంపీపీ పదవి పోకుండా చూడాలని ప్రాధేయపడ్డారు. తమకు అండగా ఉండాలని, అవిశ్వాస తీర్మానంలో నెగ్గకపోతే రాజకీయ భవిష్యత్తు ఉండదని ఎమ్మెల్యేను కోరారు. తానేమీ చేయలేనని.. కావాలంటే అధికారులకు చెబుతా అని ఎమ్మెల్యే అన్నట్లు సమాచారం. దీంతో ఎంపీపీ కుటుంబం ఆదోనికి తిరుగు ముఖం పట్టారు.

నెగ్గాలంటే..

ఎంపీపీ దానమ్మపై పెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి కచ్చితంగా 17మంది ఎంపీటీసీలు హాజరు కావాల్సిందే. 23మంది ఎంపీటీసీలకుగాను 2/3 చొప్పున 17మంది (కోరం) సమావేశంలో ఉండాల్సిందే. ఒకవేళ గతంలో హైకోర్టు తీర్పు ప్రకారం ఖాళీలను పరిగణనలోకి తీసుకోకపోతే 23మంది ఎంపీటీసీలకు గానూ 2/3 చొప్పున 15 మంది హాజరుకావాల్సి ఉంటుంది. ప్రస్తుతం వైసీపీ చెరలో 16మంది, కూటమి చెరలో 7మంది ఎంపీటీసీలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వైసీపీ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కచ్చితంగా వారికి 17మంది ఎంపీటీసీలు ఉండాల్సిందే. ఎంపీపీ దానమ్మతోపాటు వారి చెరలో ఉన్న ఆరుమంది ఎంపీటీసీలు ఈ సమావేశానికి గైర్హాజరయ్యే అవకాశం ఉంది.

ఒక్కసారే అవకాశం

అవిశ్వాస తీర్మానం పెట్టిన సమావేశానికి కోరం లేకపోయినా, కోర్టు వాయిదా వేసినా, మరే ఇతర కారణాలతోనైనా సమావేశం రద్దు అయితే మరోసారి అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సభ్యులకు అవకాశం ఉండదు. ఒకవేళ ఈ సమావేశం కోరం లేక రద్దు అయితే దానమ్మ ఎంపీపీగా కొనసాగుతారు. ఒకవేళ సమావేశం జరిగి వైసీపీ సభ్యులు అవిశ్వాస తీర్మానంలో నెగ్గితే దానమ్మ దిగిపోక తప్పదు. ఆమె స్థానంలో వైస్‌ఎంపీపీ నరేంద్రరెడ్డి తాత్కాలిక ఎంపీపీగా కొనసాగే అవకాశం ఉంది.



సమావేశానికి సిద్ధం అవుతున్న మండల అధికారులు

డివైడర్ ఎక్కిన బస్సు



కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై నన్నూరు బస్ స్టేజీ వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు డివైడర్ ఎక్కింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు వెళ్తుండగా.. నన్నూరు బస్ స్టేజీ వద్ద వెనుక వైపు నుంచి కారు క్రాస్ చేశాడు. వాటిని తప్పించబోయి డ్రైవర్ బస్సును డివైడర్ పైకి ఎక్కించాడు. అయినా ఎలాంటి ప్రమాదం జరగలేదు.

● ఓర్వకల్లు, ఆంధ్రజ్యోతి

రైలు నుంచి జారిపడిన వ్యక్తి మృతి

మంత్రాలయం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని తుంగభద్ర రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి తమిళనాడుకు చెందిన పాల్‌రాజ్(33) అనే వ్యక్తి కిందపడి మృతి చెందాడు. ఈ ప్రమాదం మంగళవారం ఉదయం జరిగింది. ఆదోని రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడులోని మధురైకు చెందిన పాల్‌రాజ్ రెండు నెలలు క్రితం షోలాపూర్‌లో కూలీ పనులకు వెళ్లాడు. పనులు ముగించుకుని సొంత పట్టణానికి నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ రైల్లో వెళ్తుండగా రైల్లో రద్దీగా ఉండటంతో డోర్ దగ్గర నిల్చొని ఉండి, అదుపుతప్పి తుంగభద్ర పాతరైల్వే స్టేషన్ (మంత్రాలయం రోడ్) దగ్గర రైల్వేట్రాక్‌పై పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు కాళ్లు విరిగి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక అతను మృతిచెందాడు. మృతుడి దగ్గర లభించిన ఆధారాలు సహాయంతో బంధువులకు సమాచారం ఇచ్చారు. ఆదోని రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య కామాక్షి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి బాబురావు బహిష్కరణ

కర్నూలు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ డీసీసీ బాబురావును రెండేళ్ల పాటు పార్టీ బహిష్కరించిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదలైంది. క్రమశిక్షణా సంఘం చైర్మన్ లింగంశెట్టి ఈశ్వరరావు ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపింది. ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ నాయకుల సమక్షంలో కార్యకర్తలపై అనుచితంగా ప్రవర్తించడం, అసభ్య పదజాలాన్ని ఉపయోగించి వారిపై భౌతికదాడికి పాల్పడినట్లు ఫిర్యాదు అందిందని, ఈ ఫిర్యాదుపై లిఖిత పూర్వకంగా సంజాయిషీ కోరగా, వాట్సప్ మెసేజ్ సంతృప్తి కరంగా లేనందున పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని అందులో పేర్కొన్నారు.

పెన్షన్ రివిజన్ చేపట్టాలి

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకోబు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు యాకోబు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు పెన్షన్ రివిజన్ వెంటనే చేయాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. యాకోబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కేకే భవన్‌లో అసోసియేషన్ 17వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో పీఆర్‌సీ 2017 సంవత్సరం జనవరి నుంచి అమలు చేయాలన్నారు. 72.8 శాతం ఐడీఏ మర్జర్‌తో పెన్షన్ రివిజన్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు 8 సంవత్సరాల నుంచి రెండో పీఆర్‌సీ అమలు కోసం అనేక పోరాటాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. మహేశ్వరరావు, సహాయ కార్యదర్శి వెంకటరామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఏ. రామలింగం, కార్యదర్శి ఎల్. విజయభాస్కర్, వైస్ ప్రెసిడెంట్ మద్దిలేటి, కోశాధికారి ఖాజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

● కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి దూసుకుపోతున్నదని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి టీజీ భరత్, మంత్రి నారా లోకేశ్ ప్రపంచ దేశాలు తిరిగి భారీ ఎత్తున పరిశ్రమల స్థాపన కోసం పెట్టుబడులు రాబట్టారని తెలిపారు. పరిశ్రమలు రాకుండా అడ్డుకున్న జగన్‌కు గత ఎన్నికల్లో ప్రజలు ఓడించారని అన్నారు. ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నారని అన్నారు. టీజీ భరత్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

● రూ.2.5 కోట్ల మేర ఆస్తి నష్టం



అగ్నిప్రమాదం జరిగిన దృశ్యం

కర్నూలు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతబస్తీ రాధాకృష్ణ థియేటర్ సమీపంలో ఉన్న శ్రీ తిరుమల్ సిల్క్స్ వస్త్ర దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సోమవారం సాయంత్రం జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో దుకాణంలో ఉన్న వస్తువులు, చీరలు, ఇతర దుస్తులు కాలిపోయాయి. నిర్వాహకులు, సిబ్బంది, కస్టమర్లు దుకాణంలో ఉండగానే ఈ ప్రమాదం జరిగింది. మొదట లైట్లు బ్లింక్ బ్లింక్ అనడంతో ప్రమాదం గుర్తించిన సిబ్బంది వెంటనే లైట్లను, ప్రధాన స్విచ్‌బోర్డులను ఆఫ్ చేశారు. అయినప్పటికీ మంటలు వ్యాపించాయి. కస్టమర్లను, సిబ్బందిని బయటకు పంపి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక శకటాలు దగ్గరలోనే ఉండటంతో ఆ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి వెంటనే చేరుకుని మంటలను ఆర్పేయడంతో చుట్టుపక్కల దుకాణాల్లో నష్టం వాటిల్లలేదు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.2.5 కోట్ల ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని దుకాణ నిర్వాహకుడు వరప్రసాద్ తెలిపారు.

పల్లె వైద్యం పడకేసింది

5వ పేజీ తరువాయి

అక్కడ పని చేస్తున్న నర్సులు, సిబ్బంది సైతం డాక్టర్లు లేరని తాము ఏమి చేయలేమని చేతులెత్తేశారు. కొన్ని పీహెచ్‌సీల్లో నియమించిన వైద్యులు మధ్యాహ్నం 12 గంటలకే ఇంటి ముఖం పట్టడంతో రోగులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

ఆదోనికి రెఫర్..



కోసిగి పీహెచ్‌సీలో చికిత్స కోసం వచ్చిన రోగులు

మాధవరం గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి సునీత దంపతులు ఉరుకుందకు వెళ్తుండ గా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆ దంపతుల ఏడు నెలల చిన్నారి లాస్య తలకు తీవ్ర గాయమైంది. రక్తమడుగులో కోసిగి పీహెచ్‌సీకి తీసుకు వచ్చారు. వైద్యులు సమ్మెలో ఉండటంతో స్టాఫ్ నర్సు, ఎంఎల్‌పీహెచ్‌పీ ప్రథమ చికిత్స అందించారు. ఆదోని ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు.

పీహెచ్‌సీలో తగ్గిన ఓపీ



తుగ్గలి పీహెచ్‌సీ

పత్తికొండ నియోజకవర్గంలో తుగ్గలి పీహెచ్‌సీకి ప్రతిరోజు 50 నుంచి 60 మంది ఓపీకి రోగులు వచ్చేవారు. ప్రస్తుతం పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉండటంతో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు ఓ ఆయుష్ వైద్యుడిని పీహెచ్‌సీకి కేటాయించారు. ఆయుష్ డాక్టర్ ఉండటంతో మంగళవారం ఓపీకి 30 మంది రోగులు వచ్చారు. కొందరు ప్రైవేటు డాక్టర్లను, ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

నేటి నుంచి 'కార్తీక' వేడుకలు

యాగంటి క్షేత్రంలో ఏర్పాట్లు పూర్తి



బనగానపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం యాగంటిలో బుధవారం నుంచి కార్తీక మాస ఉత్సవాలు పారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈఓ పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డిలు మంగళవారం తెలిపారు. ప్రతి రోజు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, సహస్ర నామావళి, పల్లకి సేవోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27న కార్తీక మాస మొదటి సోమవారం, నవంబరు 3వతేదీ కార్తీక మాస రెండవ సోమవారం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నవంబరు 5న బుధవారం కార్తీక పౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆ రోజున జరిగే వేడుకల్లో ముఖ్య అతిథులుగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ, ఎంపీ బైరెడ్డి శబరి, అరుణభారతి వ్యవస్థాపకుడు బీసీ రాజారెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా యాగంటి క్షేత్రంలో ప్రముఖ కళాకారులచే పౌరాణిక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 10వతేదీన మూడవ సోమవారం, నవంబరు 17న నాలుగో సోమవారం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఉమామహేశ్వర నిత్యాన్నదానసంస్థ, ఉమామహేశ్వర రెడ్డి అన్నదాన సంస్థ, ఉమామహేశ్వర ఆర్యవైశ్య నిత్యాన్నదాన సంస్థ తదితర సంస్థలు భక్తులకు భోజన సౌకర్యానికి ముందుకొచ్చాయన్నారు. భక్తులకు మంచి నీటి వసతికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడండి : బీసీ

● యాగంటిలో కార్తీక మహోత్సవాలపై సమీక్ష



బనగాన పల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని యాగంటిలో జరిగే మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని రాష్ట్ర ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఏర్పాట్లపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బుధవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో యాగంటికి జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తారన్నారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేయాలని సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డిని సూచించారు. తాగునీటి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్తీక పౌర్ణమి పుణ్యదినాల్లో యాగంటి ఆలయానికి భక్తుల ఒత్తిడి పెరిగే వీలున్నందున ఆసయంలో టోల్‌గేటు ఫీజులను రద్దుచేయాలని ఆలయ అసిస్టెంటు కమిషనర్ పాండురంగారెడ్డిని ఆదేశించారు. అదనపు ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేయాలని, విద్యుత్, క్యూలైన్లు తదితర వాటిపై సూచనలు, సలహాలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో హెల్త్ క్యాంపుతో పాటు ఎమర్జెన్సీ అంబులెన్సు సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆంగ్ల భాషా నైపుణ్యం తప్పనిసరి

● కలెక్టర్ సిరి



మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్య స్థాయిలోనే ఆంగ్లభాష బోధనపై దృష్టి సారించాలని, అందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను కలెక్టర్ డాక్టర్ సిరి ఆదేశించారు. మంగళశారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ విద్యాశాఖ అధికారులతో సమావేశమైన కలెక్టర్ సిరి పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్య స్థాయిలోనే ఆంగ్లభాష నైపుణ్యాలను విద్యార్థులకు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా 20 మంది రిసోర్స్ పర్సన్లను నియమించాలన్నారు. 20 మందికి రాష్ట్ర స్థాయి రిసోర్స్‌పర్సన్ల చేత శిక్షణ ఇప్పించాలని ఆదేశించారు. దీనికి వెంటనే ప్రణాళిక రూపొందించి అమలులోకి తీసుకురావాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి ఎంపీపీలు, సర్పంచులకు శిక్షణ

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్‌డీ అండ్ పీఆర్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయా మండల కేంద్రాల్లోని ఎంపీపీ హాలులో బుధవారం నుంచి 25 వరకు ఎంపీపీలు, సర్పంచులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపాల్ జి. నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా డివిజన్ స్థాయిలో నాలుగు రోజులు జరిగే శిక్షణలో స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శ్రీకాళహస్తిలో శిక్షణ పొందిన డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణ ఇస్తారని వివరించారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మంత్రాలయం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో సూగూరు గ్రామానికి చెందిన చాకలి వెంకటేష్ (50)అనే వ్యక్తి అతిగా మద్యం తాగి మృతిచెందినట్లు మాధవరం హెడ్‌కానిస్టేబుల్ వీరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మద్యానికి బానిసై మంగళవారం సూగూరు గ్రామం నుంచి మాధవరంకు వెళ్లి సరుకులు తెస్తానని చెప్పి ఇంటి నుంచి వచ్చాడు. మాధవరంలో మద్యం తాగి తూగుతూ తుంగభద్ర రోడ్డు నుంచి సర్కిల్ వైపు వస్తూ బోర్లా పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య చాకలిపద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రార్ల నియామకంలో ఇష్టారాజ్యం

12 నాటి స్నాతకోత్సవం కోసం తంటాలు.. ● జీవోలను ధిక్కరిస్తున్న వర్సిటీలు ● నేడు యాప్పికి ఆర్‌యూ ఉన్నతాధికారులు



రాయలసీమ యూనివర్సిటీ ముఖద్వారం

కర్నూలు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రార్ల నియామకాల్లో విద్యామండలి జారీ చేసిన 298852/యూఈ, ఏ-1. 2023 జీవోలను ఆర్‌యూ ధిక్కరిస్తోంది. ఆర్‌యూలో పని చేస్తున్న రిజిస్ట్రార్‌కు ఈనెల 17న డిప్యుటేషన్ కాలం పూర్తయినప్పటికీ ఆయన్నే కొనసాగించాలని ఉపకులపతి నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది. గతంలో కడప జిల్లా యోగి వేమన వర్సిటీ నుంచి రాయలసీమ విశ్వవిద్యాలయానికి, క్లస్టర్ యూనివర్సిటీకి డిప్యుటేషన్ మీద పంపిన రిజిస్ట్రార్ల పదవీ కాలం ముగిశాక వాళ్లను తిరిగి పంపించారు. సెప్టెంబరులో క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా కట్టా వెంకటేశ్వర్లుకు డిప్యుటేషన్ కాలం పూర్తయిందని వెనక్కి పంపారు. రాయలసీమ వర్సిటీ రిజిస్ట్రార్‌గా పని చేసిన అంకన్నను ఏడాదిలోపే మాతృ సంస్థకు పంపారు. కానీ ఇప్పుడు నిబంధనలకు వ్యతిరేకంగా ఆర్‌యూ రిజిస్ట్రార్‌ను పదవీ కాలం పూర్తయినా ఇంకా కొనసాగించడం వివాదాస్పదమైంది. యూనివర్సిటీలో ఉన్న ప్రొఫెసర్లకు అవకాశం ఇవ్వకుండా డిప్యుటేషన్ మీద వచ్చిన వ్యక్తిని నిబంధనలకు వ్యతిరేకంగా ఇంకా కొనసాగించడం ఏమిటనే విమర్శలు వినిపిస్తున్నాయి. విశ్వవిద్యాలయ అధికారుల వ్యవహారంపై ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. రాయలసీమ వర్సిటీలో నవంబరు 12న కాన్వకేషన్ ప్రక్రియను అడ్డుపెట్టుకుని రిజిస్ట్రార్‌ను ఇక్కడే కొనసాగించేందుకు అమోదం కోసం కొందరు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్‌ను బుధవారం కలిసేందుకు స్థానిక ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో వెళుతున్నారని కొందరు ప్రొఫెసర్లు ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి లా సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో 2, 4, 6, 8వ సెమిస్టర్ రెగ్యులర్/సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 22 నుంచి నవంబర్ 1 వరకు జరుగుతాయని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఉస్మానియా కళాశాలలో జరిగే పరీక్షకు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు అరగంట ముందు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. 861 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

నేటి నుంచి కార్తీకమాస పూజలు



ప్రత్యేక అలంకారంలో నాగనందీశ్వరుడు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభం అవుతున్నందున జిల్లాలో వెలసిన నవనందుల ఆలయాలలో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఈవో మాట్లాడారు. ఆంజనేయస్వామి దేవాలయంలో వెలసిన నాగనందిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, కుంకుమపూజలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చన పూజలు తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పౌర్ణమి రోజున సాయంత్రం గ్రామోత్సవం, జ్వాలాతోరణం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆది, సోమవారాల్లో ఉదయం 4 గంటల నుంచి రాత్రి 10 వరకు, మిగిలిన రోజుల్లో రాత్రి 9గంటల వరకు భక్తులకు ఆలయ ప్రవేశం ఉంటుందని తెలిపారు.

మహానంది ఆలయానికి ఫ్యాన్లు వితరణ



ఫ్యాన్లను పరిశీలిస్తున్న ఏఈవో మధు

మహానంది, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో పలు విభాగాల్లో ఉపయోగించుకునేందు కోసం దాత సహకారం తో 10 ఫ్యాన్లు వితరణగా వచ్చినట్లు ఏఈవో మధు తెలిపారు. మంగళవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో బెంగుళూరుకు చెందిన పురుషోత్తమ రాజు అనే భక్తుడు పది ఫ్యాన్లను అందజేశారు. వీటిని ఆలయంలో భక్తులకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేస్తామని ఏఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య, ఎలక్ట్రిషన్ దశరథలు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను వీడాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్

ఆత్మకూరురూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను వీడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో సీపీఎం పట్టణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు తీసుకుంటున్న కార్పొరేట్ దోపిడీ విధానాలపై క్షేత్ర స్థాయిలో ఉద్యమాలను ఉధృతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. టీడీపీ కూటమి పెద్దలకు చిత్తశుద్ధి ఉంటే ఆదానీ, సెకితో జగన్ కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఆపాలన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికల పేరుతో ప్రజను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, వీరన్న, సద్దాం హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



రక్తదానం చేస్తున్న గ్రామస్థులు

బండిఆత్మకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రక్తదానం మహాదానమని గ్రామయూత్ నాయకులు అమీర్, సద్దాం అన్నారు. సోమవారం మండలంలోని జీ లింగాపురం గ్రామయూత్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 40మంది యువకులు రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా యువత రక్తదానం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఇమ్రాన్, భరత్‌స్వామి, బాషా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నందికొట్కూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన నందికొట్కూరు శివారులో చోటు చేసుకున్నట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలిలా.. పగిడ్యాల మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన నారాయణ(47) సోమవారం తమ గ్రామానికి చెందిన రైతు మొక్కజొన్న విత్తనాలను నందికొట్కూరు సమీపంలో ఆరబోసేందుకు కూలీకి వచ్చాడు. రోజులాగే సాయంత్రం పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా నందికొట్కూరు శివారులో బిజినవేముల గ్రామానికి చెందిన తిరుపతయ్య ట్రాక్టర్ సడన్‌గా బ్రేక్ వేశాడు. దాంతో ద్విచక్ర వాహనం ట్రాక్టర్‌కు ఢీ కొట్టడంతో నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నారాయణకు ఇద్దరు సంతానం ఉన్నారు.

సంబరాల దీపావళి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- బాణసంచా కాల్చిన పిల్లలు, పెద్దలు
- జోరుగా సాగిన విక్రయాలు

నంద్యాల కల్చరల్/పగిడ్యాల/పాములపాడు/ఆత్మకూరు/వెలుగోడు ,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఇళ్లల్లో లక్ష్మీదేవి, శ్రీ కేదారేశ్వర స్వామి వ్రతాలను ఆచరించారు. అనంతరం తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా టపాకాయలు పేల్చారు. చిచ్చుబుడ్లు, లక్ష్మీబాంబులు, కాకరపూలు, కాకర వత్తులు, రాకెట్లు, వంకాయ బాంబులు,థౌజండ్‌వాలా, ఫైవ్ హండ్రెడ్‌వాలా బాణసంచా కాల్చుతూ దీపావళి సంబరాలు ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఆయా ప్రాంతాల్లో బాణసంచా విక్రయాలు జోరుగా సాగాయి.

రామాలయంలో పూజలు

నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో దీపావళి పర్వదిన సందర్భంగా భగవత్ సేవా ప్రాంగణంలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీదేవి ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, లక్ష్మీనారాయణ హృదయ హోమం చేశారు. రామాలయంలోని లక్ష్మీదేవి అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భగవత్ సేవాసమాజ్ సభ్యులు పాల్గొన్నారు.







పట్టణంలో టపాకాయలు కాల్చుతున్న చిన్నారులు



లక్ష్మీనారాయణహృదయ హోమంలో పాల్గొన్న భక్తులు

సుంకాలతో తీవ్ర నష్టం



నందికొట్కూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ట్రంప్ విచ్చలవిడిగా సుంకాలు విధించడంతో దేశానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం నందికొట్కూరు పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ సుంకాల మూలంగా వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, బెస్తరాజు, కొంగర వెంకటేశ్వర్లు, నాగన్న, ఉస్మాన్‌బాషా, షేక్ హుస్సేన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి

బండిఆత్మకూరు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వ్యకాస, రైతు కూలీ సంఘం, సీపీఎం నాయకులు డేవిడ్, రామచంద్రుడు, రాజు, కుళాయిస్వామిలు బండిఆత్మకూరులో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ట్రంప్ మన దేశంపై విధించిన సుంకాలను కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహమ్మద్ ఆలీ, మల్లయ్య పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు



పాతముచ్చుమర్రి ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్య పూజలు నిర్వహిస్తున్న తెల్కపల్లి రఘురామశర్మ

నందికొట్కూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అమావాస్య సందర్భంగా నియోజకవర్గంలోని పలు ఆంజనేయస్వామి దేవాలయాల్లో పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం నందికొట్కూరు జీవనజ్యోతి సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద, బిజినవేముల వద్ద, పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామంలోని అభయాంజనేయస్వామికి అమావాస్య సందర్భంగా పురోహితులు తెల్కపల్లి రఘురామశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వ ర్యంలో అన్నదానం చేశారు. అభయాంజనేయ స్వామి కమిటీ సభ్యులు భార్గవ, రజక శ్రీనివాసులు, వెంగల్‌రెడ్డి, వీరమూర్తి బోయ వెంకటేశ్వర్లు, బాకొళ్ల రామకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో ..



స్వామివారికి పూజలు

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో పురోహితుడు అనిల్ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభయ ఆంజనేయ స్వామికి నవవిధ అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆకు పూజలు, కుంకుమార్చనలు, సింధూరార్చన, పుష్పార్చనలు నిర్వహించారు.అనంతరం సాయంత్రం స్వామివారి భజనా కార్యక్రమంతో పాటు సామూహిక కుంకుమార్చనలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఏకధూపహారతి, కుంభహారతి, మహామంగళహారతులు నిర్వహించారు. ఆయా పూజాది కార్యక్రమాలలో చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

ఈ-పంట నమోదుకు గడువు పొడిగింపు



కొత్తపల్లిలో వరిని పరిశీలిస్తున్న ఏవో అమీరున్నీసా బేగం

కొత్తపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదు కోసం ప్రభుత్వం ఈ నెల 30వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి అమీరున్నిసా బేగం తెలిపారు. మంగళవారం గువ్వలకుంట్ల, కొత్తపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటను ఏవో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంటల సాగు వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం వరి పంటలో ఆకు ఎండుతెగులు వ్యాప్తి చెందుతున్నట్లు గుర్తించామన్నారు. వ్యవసాయాధికారులను సంప్రదించి మందులు పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే వర్షాల వల్ల పొలాల్లో నీరు నిలిస్తే వెంటనే బయటకు పంపించాలని రైతులకు సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నంద్యాల రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణం శివారులోని వైఎస్ఆర్‌నగర్‌లో టీడీపీ కార్యకర్త షేక్ దిలీప్ మృతి చెందారు. మంగళవారం వార్డు ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు బాధితకుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆర్థిక సాయం అందజేశారు. కార్యకర్తలకు టీడీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు: ఈఎస్

నంద్యాల టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈఎస్ రవికుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మద్యం ప్రియులు కేవలం మద్యం దుకాణాల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. అలా కాకుండా చిన్నచిన్న దుకాణాల్లో కల్తీవి కూడా ఉండొచ్చనని అన్నారు. ప్రతి బాటిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేసి కొనుగోలు చేయాలన్నారు. మద్యం దుకాణాలదారులు కూడా బెల్ట్ షాపులకు అమ్మినట్లు రుజువైతే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అకాలం వర్షం...

- రబీ మొదలైనా ఆగని వానలు
- కోసిన ధాన్యం ఆరబోటుకోలేక అవస్థలు
- దఫాదఫాలుగా పడుతుండటంతో ఆందోళనలో అన్నదాత

బండిఆత్మకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించిన రైతన్నలను అకాల వర్షం వెంటాడుతోంది. ఈ ఏడాది రబీ సీజన్ మొదలైనా వర్షాలు ఆగడం లేదు. చేయికొచ్చిన ఆరుతడి పంటలు మొక్కజొన్నలు, సోయాబీన్, మినుములు కోత కోసి ఆరబోసుకునేందుకు కూడా అవకాశం లేకుండా ప్రతిరోజు వాన కురుస్తుండటంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. వర్షం వెలిస్తే ధాన్యం ఆరబోయాలి.. వాన మొదలైతే ధాన్యం కుప్పలు చేసి పట్టాలు కపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కుప్పలపై నిలిచిన వాన నీరు తొలగించాలి.. గింజ నాణ్యత దెబ్బతింటోందని వాపోతున్నారు. రైతన్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వర్షాలు మాత్రం ప్రతి రోజు దఫాలుదఫాలుగా పడుతూనే ఉన్నారు. ఈ ఏడాది ఆరుతడి పంటల దిగుబడి అధిక వానల కారణంగా సగానికి పడిపోయింది. పెట్టుబడులు పెరిగి, అటు కష్టాలు, నష్టాలు అన్నదాతను వెంటాడుతునే ఉన్నాయి.

పరిహారం ఇవ్వాలి



నేను 2.50 ఎకరాల్లో మొక్కజొన్న వేశాను. ఈ ఏడాది పెట్టుబడులు విపరీతం పెరిగింది. గతం కన్నా ఈ ఏడాది సగం కూడా దిగుబడి రాలేదు. అధిక వానల వల్ల కంకి సన్నంగా వచ్చి గింజల దిగుబడి తగ్గింది. ప్రభుత్వం ఆరుతడి పంటల రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

- నాగరాజు, రైతు, పెద్దదేవళాపురం



పెద్దదేవళాపురంలో ధాన్యం పట్టాలపై నిలిచిన వర్షపునీరు



సంతజూటూరులో పట్టాలు కప్పుతున్న రైతులు, కూలీలు



బండిఆత్మకూరు పొలాల్లో నేల వాలిన వరి పంట

కొనుగోలులో దళారుల దగా

- దిగుబడివచ్చిందే అంతంతమాత్రం..!
- మద్దతు ధర రూ.2400.. రూ.1800లకు కొంటున్న వ్యాపారులు
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలంటున్న రైతులు



నందికొట్కూరు శివారులో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

నందికొట్కూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మొక్కజొన్న రైతులు ప్రతి అడుగులో మోసపోతూనే ఉన్నారు. విత్తనాల వద్ద నుంచి పంటను పండించి అమ్ముకునే వరకు నకిలీల మకిలీతో నలిగిపోతున్నారు. అతివృష్టి, అనావృష్టి వల్ల ఈ ఏడాది మొక్కజొన్న పంట దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. వచ్చిన దిగుబడిని కూడా గిట్టుబాటు ధరకు అమ్ముకుందామంటే దళారుల దగాకు రైతన్న బలైపోతున్నాడు.

- **నష్టాల్లో మొక్కజొన్నరైతు**

రైతన్నను అడుగడుగునా మోసం చేసే వారే ఎక్కువయ్యారు. ప్రతి సంవత్సరం మొక్కజొన్న వేస్తుండడంతో పెట్టుబడి కూడా భారీగానే పెరుగుతోంది. ఒక ఎకరం మొక్కజొన్న పంటను సాగు చేసేందుకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు వస్తోంది. దీనికి తోడు కౌలు మరో రూ.20 వేలు ఇవ్వాల్సి ఉంటుంది. ఎకరాకు మొత్తం పెట్టుబడి దాదాపు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు అవుతోంది. అతివృష్టి, అనావృష్టి వల్ల మొక్కజొన్న దిగుబడి బాగా తగ్గింది. ఎకరాకు సగటున 20 క్వింటాళ్లు దిగుబడి వస్తోంది. ఒక క్వింటాలు ధర బయట మార్కెట్‌లో రూ.1800 లకు దళారులు కొనుగోలు చేస్తూ దగా చేస్తున్నారు. ఈ లెక్కన చూస్తే రూ.36 వేల నుంచి రూ.40 వేల వరకు రైతులకు వస్తున్నాయి. దీంతో ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు నష్టం వాటిల్లుతోంది. కనీసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ద్వారా ప్రభుత్వ మద్దతు ధర రూ.2,400 కొనుగోలు చేస్తే రైతుకు కొంత మేర మంచి జరిగే అవకాశం ఉంది. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఒక వైపు వరుణుడు ప్రకోపానికి, మరో వైపు దళారుల దగాకు నిలువునా మోసపోతున్న రైతన్నను కాపాడిల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇప్పటికే జూన్‌లో సాగుచేసిన పంటలు చేతికిరావడంతో రైతులు రూ.600 నష్టానికి అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు, రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.



ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

పాముకాటుకు మహిళ మృతి

నందికొట్కూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొణిదేల గ్రామానికి చెందిన సుజాతమ్మ పొలంలో పని చేస్తుండగా పాముకాటుకు గురైంది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు నందికొట్కూరు హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సుజాతమ్మ మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఇద్దరు మహిళలు అదృశ్యం

బండిఆత్మకూరు అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు మహిళలు అదృశ్యమైనట్లు ఎస్ఐ జగన్మోహన్ మంగళవారం తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

'ఒక డీఏ ఇవ్వడం సరికాదు'

పాములపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు నాలుగు డీఏలు ఇవ్వాల్సి ఉండగా ఒక డీఏను దీపావళి కానుకగా అందిస్తామనడం బాధాకరమని పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు దామరేకుల రవి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఒక విడత 3.64 శాతం చెల్లిస్తూ 22 నెలల ఆరియర్స్ మొత్తాన్ని పదవీ విరమణ తర్వాత చెల్లిస్తామనడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వంలో వ్యతిరేకించామని, కూటమి ప్రభుత్వమైనా నెరవేరుస్తుందని గెలిపిస్తే నిరాశే మిగిల్చారని అన్నారు. జీవో నెంబరులు 60, 61ని సవరించి ఆరియర్స్ వెంటనే చెల్లించే విధంగా కొత్త జీవోను ప్రభుత్వం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అహోబిలంలో సోమిశెట్టి పూజలు



అహోబిలంలో సోమిశెట్టి దంపతులు

ఆళ్లగడ్డ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలాన్ని మంగళవారం కుడా చెర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో సోమిశెట్టి దంపతులకు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామికి వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సోమిశెట్టి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు గూడురు సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ యజమానుల ధర్నా



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న ట్రాక్టర్ యజమానులు

బనగానపల్లె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాధుకొట్టం సమీపంలోని రాయల్టీ చెక్‌పోస్టు వద్ద ఎర్రమట్టి తోలుకునే ట్రాక్టర్ యజమానులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఇళ్లకు తోలే మట్టిపై కూడా రాయల్టీ వసూలు చేస్తున్నారని, అందుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ధర్నాను విరమింపజేశారు. ఈసందర్భంగా ట్రాక్టర్ యజమానులు మాట్లాడుతూ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు పేదల ఇళ్లపై వేసుకునే మట్టిపై కూడా రాయల్టీ చెల్లించాలంటూ బలవంతంగా వసూలు చేస్తున్నారన్నారు. మట్టి మిద్దెలకు తీసుకు వెళ్లే ట్రాక్టర్‌పై టన్నుకు రూ.90లు వసూలు చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాయల్టీలు వసూలు చేయడం అన్యాయమన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

బనగానపల్లె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దివ్యాగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని దివ్యాంగులు కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బాలాంజనేయులును కలిసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులు మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుంటే వచ్చే నెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో అందనం దేవరాజు, దస్తగిరి, మోహన్, మద్దిలేటి, సాదిక్, శీలన్న, ఓబులేసు, గురప్ప, గోవింద్ పాల్గొన్నారు.

అప్రెంటిషిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

డోన్ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ట్రేడులలో ఐటీఐ పాసైన అర్హులైన అభ్యర్థులు ఏపీఎస్ఆర్టీసీ అప్రెంటిషిప్ కోసం ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల జిల్లా కన్వీనర్ ప్రసాదరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన డోన్ ప్రభుత్వ ఐటీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్‌లలో వచ్చే నెల 8వ తేదీ లోపు అప్రెంటిషిప్ కోసం తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని, దరఖాస్తు చేసుకోవడానికి నవంబరు 8వ ఆఖరిరోజు అని తెలిపారు.

విద్యుత్ టవర్ ఏర్పాటు

డోన్ టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో కర్నూలు నుంచి వచ్చే 132 కేవీ లైన్ విద్యుత్ టవర్ మరమ్మతులకు గురికావడంతో దాని స్థానంలో కొత్త టవర్ నిర్మిస్తున్నట్లు డోన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నాగేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 22, 23, 24వ తేదీల్లో విద్యుత్ పనులు జరుగు తాయన్నారు. మండలంలోని సబ్ స్టేషన్లకు ఇచ్చే విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని గమనించి సహకరించాలన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కల్లుగీత కార్మికులను అవమానిస్తే ఊరుకోం

కొలిమిగుండ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కల్లుగీత కార్మికులను అవమానిస్తే ఊరుకోనేది లేదని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండయ్యగౌడ్ హెచ్చరించారు. మంగళవారం కొలిమిగుండ్లలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జోగి రమేష్‌పై ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అసత్య ఆరోపణలు చేస్తూ కల్లుగీత కార్మికులను హేళన చేశాడని అన్నారు. మరోసారి పునరావృత్తమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్

సంజామల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయిలో ఎస్‌జీఎఫ్ క్రీడలను హెచ్‌ఎం మురళీకృష్ణ శాస్త్రితో కలిసి సర్పంచ్ రాజు ప్రారంభించారు. అండర్ - 14, అండర్ - 17 విభాగాల్లో బాలురుకు ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలు డివిజన్‌స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు సమన్వయకర్త వ్యాయామ సంచాలకులు బాషా తెలిపారు. పోటీలకు చిన్న మౌలాలి, హరికృష్ణ, ప్రతాప్, హుసేన్ వలి, పవన్ కుమార్, నాగలక్ష్మి, మల్లికార్జునలు పీడీలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పలకు భిక్ష వసతి

చాగలమర్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఏకశిల పదునెట్టాంబటి అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం నుంచి అయ్యప్పస్వామి దీక్షాదారులకు భిక్ష వసతి ఏర్పాటు చేసినట్లు ఆలయ అధ్యక్షుడు జనార్దన్, కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. 2026 జనవరి 15వ తేదీ వరకు భిక్ష సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దంచికొట్టిన వర్షం

కొండమాయపల్లెలో నేల వాలిన వరి పంట





కొండమాయపల్లెలో నేలవాలిన వరి పంట, డోన్ ప్రభుత్వ అతిథి గృహం ప్రధాన గేటులో నిలిచిన వర్షం నీరు

డోన్ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. పట్టణంలోని ప్రధాన రోడ్లు చిత్తడి చిత్తడిగా మారాయి. ప్రభుత్వ కార్యాలయాల వద్ద వర్షం నీరు నిలిచింది. అలాగే మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కురిసిన వర్షానికి ఓ రైతు నష్టపోయాడు. వేసిన కాకరపంట పందిరి వర్షానికి పడిపోయి నష్టపోయినట్లు రైతు చంద్రమోహన్ వాపోయారు.

రుద్రవరం: మండలంలో మంగళవారం వర్షం కురిసింది. మండలంలోని కొండమాయపల్లె, వెలగలపల్లె గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో వరి పంట నేలవాలింది. కోటకొండ, పెద్దకం బలూరు, ముత్తలూరు, నరసాపురం, తిప్పారెడ్డిపల్లె, రుద్రవరం గ్రామాల్లో రహదారులపై ఆరబోసిన మొక్కజొన్నలు తడిచి ముద్దయ్యాయి, చేతికందిన పంట నష్టపోతున్నామని రైతులు వాపోయారు.

చాగలమర్రి: చాగలమర్రి మండలంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. 3.6 మీ.మీ వర్షపాతం నమోదైంది. రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను నూర్పిడి చేసి రహదారులలో ఆరబెట్టుకున్నారు. ఈ వర్షంతో మొక్కజొన్న ధాన్యం తడిచింది.

అన్నదాతలపై అల్పపీడనం పిడుగు

- ఇప్పటికే అధిక వర్షాలతో నష్టపోయిన రైతులు
- నిలిచిన రబీ సాగు



కొలిమిగుండ్లలో కురుస్తున్న వర్షం

కొలిమిగుండ్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అన్నదాతలపై మరోమారు అల్పపీడనం పిడుగు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే జిల్లాలో అధిక వర్షాలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. నిత్యం కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాలలో రబీ సాగు సైతం నిలిచిపోయిన పరిస్థితి. నైరుతి బంగాళఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో మంగళవారం జోరుగా వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఈ అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని, రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరించడంతో రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. గత కొద్ది రోజులుగా తరచూ కురుస్తున్న వర్షాలతో పొలాలు బురదమయంగా మారి, ఆరకపోవడంతో పప్పు శనగ సాగు చేయాల్సిన రైతులు వాయిదా వేసుకుంటూ వస్తున్నారు. ఈ వర్షాలతో మరికొద్ది రోజులు వేచి చూడక తప్పని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే శనగ సాగుకు అదను కూడా తప్పిపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

అరటి తోటను తొలగించారు



చిన్నవంగలిలో అరటి చెట్లను కొట్టివేసిన మహిళా రైతు

చాగలమర్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అరటికి ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. మండలంలోని చిన్నవంగలి గ్రామంలో మహిళా రైతు బాపతి రామలక్ష్మమ్మ కూలీలతో అరటి చెట్లను మంగళవారం తొలగించారు. ఎకరాకు రూ.లక్ష దాక వ్యయం చేశామని, ధర లేక అరటి గెలలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 2 ఎకరాల్లో సాగు చేసిన అరటి తోటను తొలగించి ప్రత్యామ్నాయ పంట సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. గత ఏడాది టన్ను అరటి రూ.20 వేలు పల కడంతో 300 ఎకరాల దాక సాగు చేశారు. అరటి గెలలు వచ్చే సరికి ధర రూ.2 వేలకు పడిపోయిందని, కొనుగోలు చేసేం దుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని, దీంతో అరటి తోటను తొలగించినట్లు ఆమె తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : సీఐ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ దస్తగిరిబాబు

శిరివెళ్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని శిరివెళ్ల సర్కిల్ సీఐ దస్తగిరిబాబు అన్నారు. మండలంలోని యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్, పోక్సో యాక్ట్, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సీఐ అవగాహన కల్పించారు. విద్యార్థులపై సెల్‌ఫోన్, సోషల్ మీడియా ప్రభావంపై ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్న పీరయ్య, హెచ్‌ఎం విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోట్ల దంపతులను కలిసిన టీడీపీ నాయకులు



కోట్ల దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ప్యాపిలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): డోన్‌లోని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ నివాసంలో సోమవారం ప్యాపిలి పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు కోట్ల దంపతులను కలిశారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా కొంగనపల్లి మధును నియమించడంతో మర్యాదపూర్వకంగా కలిసి వారికి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజా నారాయణమూర్తి, టి.శ్రీనివాసులు, ఖాజావీర్, రామ్మోహన్‌యాదవ్, ప్రసాద్ రెడ్డి, మధు, చల్లా వీరాంజినేయులు, గండికోట రామాంజినేయులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ విధానంతో అధిక దిగుబడులు సాధించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ధనలక్ష్మి

డోన్ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నూతన వ్యవసాయ విధానాలను అవలంభించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని డోన్ వ్యవసాయ ఏడీఏ సునీత అన్నారు. మంగళవారం మండలంలోని నక్కల వాగుల పల్లె గ్రామంలో వేరుశనగలో విశిష్ట రథంపై క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఏడీఏ సునీత అంతర్ పంటలపై ఆమె రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ధనలక్ష్మి రైతులకు వివిధ రకాల పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుధాకర్, ఆదినారాయణ, రవి గౌడు, డోన్ మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో చెంచులు అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి అన్నారు. మంగళవారం చాగలమర్రి చాగలమ్మ చెంచు కాలనీలో వ్యాధు లపై చెంచులకు అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి జ్వర బాధితు లకు రక్తపూత పరీక్షలు చేశారు. డెంగీ, మలేరియా జ్వరాలపై నిర్లక్ష్యం చేయకుండా వైద్య చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో ఏఎన్‌ఎం గార్లేట్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విజయోత్సవ సభను జయప్రదం చేయాలి

బనగానపల్లె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఈనెల 25న నిర్వహిస్తున్న ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పూలరాజు పిలుపునిచ్చారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద కరపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో చౌరయ్య, సుబ్బమ్మ, మధు, శంకరమ్మ, అంకన్న, సవారి, శివుడు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీకమాసం ప్రారంభం

ముస్తాబైన ఆలయాలు



చాగలమర్రిలో ముస్తాబైన పాత శివాలయం

చాగలమర్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నుంచి కార్తీక మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. చాగలమర్రిలోని రామలింగేశ్వర, భీమలిం గేశ్వర, బుగ్గమల్లేశ్వర, భైరవీశ్వర, మలయచల మల్లేశ్వర, గృహ మద్దిలేటి ఆలయాలను ముస్తాబు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రామలిం గేశ్వర ఆలయంలో నవంబరు 21 వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారని ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. మహిళలతో సామూహికంగా విష్ణుసహస్ర పారా యణం, శివపార్వతుల కల్యాణం, జ్వాలతోరణోత్సవం నిర్వహిస్తామని అన్నారు.

కొలిమిగుండ్ల: కార్తీక మాసం పూజలకు మండలంలోని వివిధ గ్రామాల్లో వెలసిన శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. మండలంలోని నేలబిలం మల్లేశ్వరస్వామి, గుండు మల్లేశ్వ రస్వామి, కాచూటీ విశ్వేశ్వర స్వామి, గుండం ఆంజనేయస్వామి, కొలిమిగుండ్ల లలితా సుందరేశ్వర స్వామి ఆలయాల్లో కార్తీక మాసం పూజలు నిర్వహిస్తారు. స్వామి వార్లకు విశేష అభిషేకాలు, పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో భాగ్యలక్ష్మి

రుద్రవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో భాగ్యలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం కోటకొండ సచివాలయాన్ని ఆమె తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించి బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈకేవైసీ చేయించుకోండి: ఏపీడీ

చాగలమర్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేసే వారంతా జాబ్‌కార్డులతోపాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఉపాధి ఏపీడీ సాంబశివరావు, ఎంపీడీవో తాహిర్‌హుసేన్ తెలిపారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలో జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీల ఇళ్ల వద్దకు వెళ్లి జాబ్‌కార్డులను పరిశీలించారు. వారికి ఈకేవైసీ చేయించారు. వారు మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకోకపోతే ఉపాధి హామీ పథకం ద్వారా ఎటువంటి లబ్ధి చేకూరదని, ఉద్యాన పంటల రాయితీలు కూడా లభించవని అన్నారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ అధి కారి రషీద్‌ఖాన్, ఎఫ్ఏ మహబూబ్‌బాషా కరిముల్లా పాల్గొన్నారు.

రోడ్లపై మొక్కజొన్న లేకుండా చూడాలి

చాగలమర్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై మొక్కజొన్న ఆరబెట్టడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని కేపీ తాండ గ్రామానికి చెందిన గిరిజనులు మంగళవారం చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌కు వినతి పత్రం అందజేశారు. మూడురాళ్లపల్లె గ్రామ రహదారిలో మొక్కజొన్నను ఆరబెట్టడంతో బుక్కె పిచ్చెనాయక్ రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారన్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరారు.

ప్రత్యేక హోదాతోనే ఏపీ అభివృద్ధి



సంతకాల సేకరణలో కాంగ్రెస్ నాయకులు

డోన్ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రత్యేక హోదాతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. ఓట్ల దొంగ గద్దె దిగు.. అనే నినాదంతో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా డోన్ పాతబస్టాండులో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి డోన్ సీపీఎం నాయకులు నక్కి శ్రీకాంత్ సంపూర్ణ మద్దతు తెలిపారు. గార్లపాటి మద్దిలేటి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రజలకు న్యాయం జరగాలంటే.. కావాల్సింది జీఎస్టీ ఉత్సవాలు కాదని, ప్రత్యేక హోదాతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డీసీసీ ఉపాధ్యక్షులు మల్లెంపల్లె జనార్దన్, రాజశేఖర్, గోపినాథరావు, మహేంద్రనాయుడు పాల్గొన్నారు.

పురమిత్ర యాప్‌తో లాభాలు



మాట్లాడుతున్న కమిషనర్ హరిప్రసాద్

బేతంచెర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పురమిత్ర యాప్‌తో ఎన్నో లాభాలు ఉన్నాయని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో పురమిత్ర యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పురమిత్ర యాప్‌తో సమస్యలను ఇంటి వద్ద నుంచి పరిష్కరించుకోవచ్చునన్నారు. మెప్మా, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి: ఏవో

రుద్రవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో సుమతి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 16 రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలన్నారు.

టపాసులు పేలుస్తుండగా తీవ్ర గాయాలు

బనగానపల్లె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేటకు చెందిన మహమ్మద్ అనే యువకుడు టపాసులు పేలుస్తుండగా తీవ్రగాయాలయ్యాయి. దీపావళి పర్వదినం సందర్భంగా మహమ్మద్ టపాసులు కాలుస్తుండగా ప్రమాదవశాత్తూ మొహం, చేతులు కాలిపోయాయి. అతన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి..

డోన్ టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాల య్యాయి. ఈ ఘటన డోన్ పట్టణంలోని జాతీయ రహదారి వద్ద సోమవారం జరిగింది. మండలంలోని దొరపల్లె చెందిన కున్నూరు నాగరాజు పని నిమిత్తం వెళ్తుండగా మ్యాక్స్ ఫోర్ హోటల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిం చారు. నాగరాజు పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఘనంగా దీపావళి

చాగలమర్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేద పండితుడు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో ధనలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కూరపాటి వీధిలో మహిళలు సామూహికంగా దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణ బాబు, కార్యదర్శి నవతాప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లలు, పెద్దలు బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అలాగే పట్టణంలోని పెద్దమ్మ, అంకాలమ్మ, దుర్గమ్మ, సాయిబాబబా, వెంకటేశ్వరస్వామి, హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. పిల్లలు, యువకులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. మహిళలు లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం నుంచి కార్తీకమాసం ప్రారంభం కావడటంతో ఆలయాలు విద్యుదీపాలతో శోభాయామానం సంతరించుకున్నాయి.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం దీపావళి వేడుకలు ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా టపాసుల దుకాణాలు వినియోగదారులతో కిక్కిరిసిపోయాయి.

బేతంచెర్ల: పట్టణంతోపాటు గ్రామాల్లో దీపావళి పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఇంటి ముందు జ్యోతులను వెలిగించి టపాసులు పేల్చారు. లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు.





చాగలమర్రిలో దీపోత్సవం చేస్తున్న మహిళలు, ప్యాపిలిలో పెద్దమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు